పన్ను వసూళ్లలో పట్టీ

- లక్ష్యం కొండంత.. వసూళ్లు గోరంత
- మొద్దు నిద్రలో అధికారులు, సిబ్బంది
- పుట్టపర్తి మున్సిపాలిటీలో పేరుకుపోతున్న బకాయిలు


మున్సిపాలిటీ కార్యాలయం


పన్నులు వసూళ్లపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పుట్టపర్తి టౌన్: పన్ను వసూళ్లలో పుట్టపర్తి పురపాలక సంఘం చతికిలపడింది. ఆస్తి, నీటి పన్నులతో పాటు ట్రేడ్ లైసెన్స్ తదితర ఫీజులు వసూళ్ల గురించి అధికారులు, సిబ్బంది తమకేమీ పట్టనట్టు వ్యవహరించడంతో బకాయిలు పేరుకుపోయాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 14,101 గృహాలు నుంచి రూ.7,28,71,504 వసూళ్లు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.1,97,79,940 వచ్చింది. ఇంకా రూ.5,30,91,554 బకాయిలు ఉన్నాయి. ఇక 3,496 నీటి కుళాయిలకు సంబంధించి పన్ను రూపంలో రూ.85,92,666 రావాల్సింది. ఇందులో రూ.8,36,144 వసూళ్లు చేశారు. రూ.77,51,116 బకాయిలు నిలిచిపోయాయి. ఖాళీ స్థలాలకు సంబంధించి 303 అసెస్‌మెంట్ల నుంచి రూ.49,23,311 రావాల్సి ఉండగా రూ.11,45,490 మాత్రమే వసూలు చేయగలిగారు. రూ.37,77,823 బకాయిలు నిలిచిపోయాయి. 2024–2025 ఆర్థిక సంవత్సరం నెలన్నరలో ముగియనుంది. పన్నుల వసూళ్లు మాత్రం మందగమనంలో కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 20 శాతానికి మించి పన్నుల వసూళ్లు ముందుకు పోలేదు.

అంతులేని నిర్లక్ష్యం

సామాన్యుల నుంచి ముక్కుపిండి వసూళ్లు చేసే మున్సిపల్ అధికారులు ప్రభుత్వ శాఖలపై మాత్రం ప్రేమ చూపిస్తున్నారు. నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారే తప్ప వసూళ్ల జోలికి వెళ్లడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపాలిటీకి రావాల్సిన బకాయిల వసూళ్లను గాలికి వదిలేసి తమజేబులు నింపుకోవడానికి రెవెన్యూ అధికారులు ఆరాటపడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. భవన నిర్మించుకున్న వారు పన్ను వేయించేందుకు దరఖాస్తు చేసుకుంటే అడిగినంత ముట్టచెబుతారో వారి ఫైలు మాత్రమే క్లియర్ చేస్తారు. మిగిలిన ఫైళ్లు పెండింగులో ఉండి పోతున్నాయి.

లక్ష్యం చేరుకుంటాం

బకాయిదారులు పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి. మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేస్తున్నాం.అప్పటికీ స్పందించకపోతే కుళాయి, డ్రెయినేజీ కనెక్షన్లు కట్ చేస్తాం. 'స్పెషల్ డ్రైవ్' ద్వారా రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులను పురమాయించి పన్నులు వసూళ్లు చేస్తున్నాం. ప్రభుత్వ శాఖలకు కూడా నోటీసులు జారీ చేశాం. మార్చి నాటికి వంద శాతం లక్ష్యాన్ని చేరుకుంటాం.

– ప్రహ్లాద, కమిషనర్, పుట్టపర్తి

క్లుప్తంగా

పట్టాలు మంజూరు చేయాలి


తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ఇంటి పట్టాలు మంజూరు చేయాలని ఆర్‌సీపీఐ నాయకులు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు గురువారం ధర్నా నిర్వహించారు. ఆర్‌సీపీఐ శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి డాక్టర్ నాగన్న మాట్లాడుతూ పట్టణంలోని 34 వార్డు పరిధిలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 1778–1బీలో గత ప్రభుత్వ హయాంలో నిరుపేదలు ఇళ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. ఏడాది గడుస్తున్నా కాలనీలో కనీస సదుపాయాలు కల్పించలేదన్నారు. ఇల్లు నిర్మించుకున్న వారికి ఇంటి పట్టాలు మంజూరు చేసి కాలనీలో సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సురేంద్రకు వినతిపత్రం అందజేశారు. నాయకులు అరుణ్, శేఖర్, రాజు, సుగుణమ్మ, వెంకటలక్ష్మమ్మ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు కరాటే శిక్షణ


శిక్షణలో పాల్గొన్న బాలికలు

తనకల్లు: కొక్కంటిక్రాస్‌లో ఉన్న సరస్వతీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో విద్యార్థినులకు గురువారం కరాటేలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ సనత్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలికలపై అఘాయిత్యాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని తెలిపారు. విద్యార్థినులు తమకు తాము రక్షించుకోడానికి కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కరస్పాండెంట్ శ్రీవాణి, హెచ్ఎం నరేష్, కరాటే మాస్టర్ షెక్షావలి, పీఈటీ నజీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు

ధర్మవరం అర్బన్: జాతీయ సమైక్యత శిబిరానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థి, ఎన్ఎస్ఎస్ వలంటీర్ హేమంత్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు. హేమంత్‌కుమార్ మహారాష్ట్రలోని శివాజీ యూనివర్సిటీ కొల్లాపూర్‌లో ఈనెల 16 నుంచి 22 వరకు జరిగే జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొంటాడని తెలిపారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోపాల్‌నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు చెన్నకేశవస్వామి తడకోత్సవం

పుట్టపర్తి అర్బన్: బుక్కపట్నం మండలం చంద్రాయునిపల్లి అటవీ ప్రాంతంలో వెలసిన చెన్నకేశవస్వామి ఆలయంలో ఈనెల 15 తడకోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు తరుగు వంశీయులు, పూజారులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. మాఘమాసంలోని మూడో శనివారం స్వామి ఆలయంపై భాగాన తడక వేస్తామని వారు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

కుష్టు సర్వే పక్కాగా చేపట్టండి


సమావేశంలో పాల్గొన్న అధికారులు

నల్లచెరువు: గ్రామాల్లో కుష్టు రోగులను గుర్తించే సర్వే పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రఘునాథగుప్త వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కల్పనరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్త, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. అప్పుడే పుట్టిన శిశువులకు ఏవైనా లోపాలు ఉన్నట్లయితే వెంటనే స్థానిక వైద్యాధికారులకు తెలియజేయాలన్నారు. బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రామక్రిష్ణ, సీహెచ్ఓ రామచంద్రారెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



అర్హత పత్రాలు నమోదు చేస్తున్న నాయకులు

కదిరి టౌన్: కూటమి నాయకులు ఎన్నికల హామీలను నెరవేర్చాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని గజ్జలరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు కచ్చితంగా మంజూరు చేయాలన్నారు. అర్హులందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ వచ్చే నెల 3న సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాకు పేదలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. అనంతరం కాలనీ వాసులతో అర్హత పత్రాలు నమోదు కార్యక్రమం చేపట్టారు. నాయకులు పవన్, లియాకత్ ఆలీ, మధు, మహేంద్ర, మహేష్‌నాయక్, శోభారాణి, భవాని తదితరులు పాల్గొన్నారు.

టెంకాయల విక్రయ వేలం

ముదిగుబ్బ: సంకేపల్లి వద్ద వీరనారాయణస్వామి పరుషలో శివరాత్రి జాగారం మరుసటి రోజున టెంకాయల విక్రయ హక్కు కోసం గురువారం వేలం పాట నిర్వహించారు. సంకేపల్లికి చెందిన రాజేష్ అనే వ్యక్తి రూ.3.50 లక్షలకు వేలం దక్కించుకున్నాడు.

తిమ్మమ్మ మర్రిమాను అభివృద్ధికి చర్యలు


అభివృద్ధి పనులపై కమిటీ సభ్యులతో ఆరా తీస్తున్న టూరిజం అధికారులు

ఎన్పీకుంట: ప్రపంచ ప్రసిద్ధి గాంచిన తిమ్మమ్మ మర్రిమాను అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా టూరిజం అధికారి జయకుమార్‌బాబు తెలిపారు. గురువారం ఆయన తిమ్మమ్మమర్రిమానును సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తిమ్మమాంబ ఆలయ కమిటీ సభ్యులు గతంలో తిమ్మమాంబ ఆలయం, తిమ్మమ్మమర్రిమానును అభివృద్ధి పరచాలని డిప్యూటీ సీఎంకు విన్నవించారన్నారు. ఈనేపథ్యంలోనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పర్యటిస్తున్నట్లు తెలిపారు. తిమ్మమాంబ ఆలయంతో పాటు మర్రిమాను పరిసర ప్రాంతంలో పర్యాటకుల సౌకర్యార్థం అభివృద్ధి పనులు చేపట్టాలని కమిటీ సభ్యులు కోరారు. వీటికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందిస్తామని టూరిజం అధికారులు తెలిపారు. స్థానిక సర్పంచ్ విష్ణుమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు వెంకటనారాయణ, శ్రీనివాసులు, నారాయణస్వామి, టూరిజం డీఈ కుమార్, ఏఈ నారాయణ, గైడ్ మనోహర్ తదితరులు ఉన్నారు.

రాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న బలిజ సంఘం నాయకులు

పుట్టపర్తి టౌన్: శ్రీకృష్ణదేవరాయల జయంతి, వర్ధంతి, పట్టాభిషేక మహోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని పుట్టపర్తి బలిజ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఓ అపార్టుమెంట్‌లో బలిజసంఘం నాయకలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని ఎందరో మహనీయుల సేవలను గుర్తించి వారి జయంతులు, వర్ధంతులను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పెనుకొండ, చంద్రగిరిలో శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక మహోత్సవాలు జరిపారన్నారు. ఈనెల 16న శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు చింతా దామోదర్, అకుల బాల గంగాధర్, శ్రీరాములు, సుబ్బరాజు, కూర్మ నాయకులు ఆంజనేయులు, చలపతి, సాయికుమార్, రవికుమార్, దాసరి శంకర్, ఓబుళపతి, వంశీకుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

తాడిమర్రి: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. మరవపల్లిలో గురువారం 100 మంది రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేశారు. లోఓల్టేజీతో రైతులు అవస్థలు పడకుండా విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం ఆయన శివంపల్లిలో తాగునీటి ఏటీఎంను ప్రారంభించారు. ఎంపీడీఓ వెంకట రంగారావు, తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

బత్తలపల్లి: పత్యాపురంలో గురువారం సిమెంట్ రోడ్డును మంత్రి సత్యకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఆర్డీవో మహేష్, తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు, సర్పంచు గుజ్జల రమాదేవి పాల్గొన్నారు.

డీఈఓలు, డ్రైవర్లకు స్లాబ్‌లు అమలు చేయాలి

తాడిమర్రి: రాష్ట్రంలో 104 వాహనం ద్వారా ప్రజా ఆరోగ్యం కోసం కృషి చేస్తున్న తమకు స్లాబ్‌లు అమలు చేయాలని మంత్రి సత్యకుమార్‌ను 104 డీఈఓలు, డ్రైవర్లు కోరారు. ఈమేరకు గురువారం వారు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నూతనంగా తెచ్చిన ఆర్ఈఎఫ్‌తో డీఈఓలు, డ్రైవర్లకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. జీతభత్యాల విషయంలో ఎటువంటి మార్పు లేదని, అలాగే స్లాబ్‌లో స్పష్టత లేదన్నారు. అంతిమంగా సీటీసీ అనే పదాన్ని పెట్టడంతో యాజమానులు, ఉద్యోగులకు తీవ్ర నష్టాన్ని వాటిల్లితుందన్నారు. ఉద్యోగులకు సరైన జీతభత్యాలు, పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌వీ నాగేశ్వర్‌రావు, వీఆర్ పణికుమార్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ముదిగుబ్బ: కాశిరెడ్డినాయన ఆశ్రమ సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన పేకాట ఆడుతున్న ఐదుగురిని గురువారం అరెస్ట్ చేసినట్లు సీఐ శివరాముడు తెలిపారు. నిందితుల నుంచి రూ.5650 నగదుతో పాటు 5 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి


విద్యార్థులకు సూచనలిస్తున్న రామానుజం

పుట్టపర్తి అర్బన్: విద్యార్థులు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని టీసీఎస్ వర్క్‌ఫోర్స్ మేనేజర్ రామానుజం సూచించారు. విద్యారంగంలో నైపుణ్యాలను పెంపొందించడానికి పుట్టపర్తి సంస్కృతి విద్యాసంస్థల్లో గురువారం మెంటార్‌షిప్ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఈ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు, సాంకేతిక అభివృద్ధి, సమస్య పరిష్కారం తదితర సామర్థ్యాలపై అవగాహన కలిస్తామని నిర్వాహకులు తెలిపారు. బ్యాంకింగ్, టెలికాం, ఎనర్జీ, ఇన్సూరెన్స్, హెచ్‌ఆర్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీలపై రామానుజం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్కృతి యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం


రోగులకు అన్నదానం చేస్తున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో మధ్యాహ్నం రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. యువర్స్ ఫౌండేషన్ కోశాధికారి మోహన్‌గుప్త, సభ్యులు వైకే శ్రీనివాసులు, రమేష్‌బాబు, మల్లికార్జునలు దాతల సహకారంతో రోగులు, వారి సహాయకులు 300 మందికి అన్నదానం చేశారు. ఇదిలా ఉండగా ప్రభుత్వాస్పత్రిలోని రోగులు, వారి సహాయకులకు గురువారం శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు పాలు, బ్రెడ్డు, బిస్కెట్లు పంపిణీ చేశారు. శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు సాంబశివుడు, సాగర్ పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్యసూత్రాలు పాటించాలి

తలుపుల: గర్భిణులు ఆరోగ్యసూత్రాలు పాటించాలని వైద్యాధికారులు అఫ్తాప్, ఆశ్రిత సూచించారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా 98 మందికి వైద్యపరీక్షలు చేయగా 19 మంది రక్తహీనత ఉన్నట్లు గుర్తించి ఐరన్, సూక్రోజ్ ఇంజెక్షన్లు వేశారు. అలాగే 22 మందిని అల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు రెఫర్ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. మన్సూర్ వారి మిత్ర బృందం గర్భిణులకు భోజన సౌకర్యం కల్పించారు.

సజావుగా అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు


అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

ధర్మవరం అర్బన్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల పోస్టుల ఇంటర్వ్యూలు సజావుగా జరిగాయి. ధర్మవరం, బత్తలపల్లి, చెన్నేకొత్తపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టులకు సంబంధించిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి, ఆర్డీఓ మహేష్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సెల్వియా సాల్మన్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 92 మందికిగాను 74 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అర్హత గల వారికి తగిన ప్రగతి వివరాలను పొందుపరిచి నివేదికను కలెక్టర్ కార్యాలయానికి పంపించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా మండలాల్లో ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని ఆర్డీఓ తెలిపారు. ధర్మవరం, బత్తలపల్లి, చెన్నేకొత్తపల్లి సీడీపీఓలు లక్ష్మి, సరస్వతి, కవిత పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ పోస్టు ఇవ్వాలని హెల్పర్ నిరసన


ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న హెల్పర్ పరిమళ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శారదానగర్–3 అంగన్‌వాడీ కేంద్రంలో 11 ఏళ్లుగా పని చేస్తున్న తనకు అంగన్‌వాడీ టీచర్‌గా ప్రమోషన్ ఇవ్వాలని హెల్పర్ నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈసందర్భంగా శారదానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేసే హెల్పర్ పరిమళ తన కుమారుడిని ఒడిలో పెట్టుకుని నిరసన తెలిపారు. శారదానగర్–3 అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేసే అంగన్‌వాడీ టీచర్ ఏడాది క్రితం ఉద్యోగం మానేశారన్నారు. హెల్పర్ అయిన తనకు టీచర్‌గా ప్రమోషన్ ఇవ్వకుండా ఐసీడీఎస్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. తనకు రావాల్సిన ప్రమోషన్ స్థానంలో వేరే వారికి ట్రాన్స్‌ఫర్ కింద టీచర్ పోస్టు ఇవ్వాలని చూస్తున్నారని వాపోయారు.

నూతన వంగడాలు సాగు చేయండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పుట్టపర్తి అర్బన్: వేరుశనగలో కే–6కు ప్రత్యమ్నాయంగా నూతన వంగడాలను విస్తారంగా సాగు చేయాలని కదిరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. గురువారం పుట్టపర్తి మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. కదిరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బీవీ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ నరసింహులు, ఏరువాక శాస్త్రవేత్త రామసుబ్బయ్య మాట్లాడారు. నూతన వంగడాలైన కదిరి లేపాక్షి, కదిరి చిత్రావతి, కదిరి అమరావతి, వశిష్ట రకాలను సాగు చేయాలన్నారు. తెగుళ్ల తీవ్రతను తగ్గించడానికి పొలం గట్లపై ఉన్న వయ్యారిభామ మొక్కలను పూర్తిగా తొలగించాలన్నారు.

అంతర పంటలతో అధిక లాభాలు

పండ్ల తోటల్లో అంతర పంటలతో అధిక లాభాలు సాధించవచ్చని ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం అధికారులు, కదిరి శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. కోవేలగుట్టపల్లి సమీపంలోని రైతు భాస్కర్‌రెడ్డి మామిడి తోటలో అంతర పంటగా సాగు చేసిన వేరుశనగ పంటలను పరిశీలించారు. సుమారు రెండు నెలల క్రితం సాగు చేసి కదిరి లేపాక్షి రకం వేరుశనగ పంటలో యాజమాన్య పద్ధతులు, ఎరువుల, మందుల పిచికారీపై రైతులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతర పంటలను సాగు చేయడం ద్వారా ఒక పంట ఏదైన కారణాలతో నష్టపోతే మరో పంటలో దిగుబడి సాధించి లాభాలు ఆర్జించవచ్చన్నారు. ఏఓ వెంకటబ్రహ్మం, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన గిరిజన విద్యార్థినులు


సత్తా చాటిన గిరిజన విద్యార్థినులు

కదిరి టౌన్: కదిరి మండలం గట్టు వద్ద ఉన్న గిరిజన గురుకుల ప్రతిభ పాఠశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ జి.వెంకట్రామనాయుడు గురువారం తెలిపారు. మెయిన్స్‌లో సౌమ్య 71, వి.శ్రావణి 66, బి.జ్యోతి 53 పర్సంటైల్ సాధించారన్నారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

మద్యం షాపులో వాటా ఇవ్వలేదని దాడి

- 'పల్లె' అనుచరుల దాష్టీకం
- పుట్టపర్తి బీజేపీ మండలాధ్యక్షుడు భాస్కర్ రెడ్డిపై దాడి


గాయాలపాలైన భాస్కర్ రెడ్డి

అనంతపురం: కల్లు గీత కులాల కోటాలో దక్కిన మద్యం షాపులో తమకు వాటా ఇవ్వలేదని పల్లె రఘునాథ రెడ్డి అనుచరులు వీరంగం సృష్టించారు. ఏకంగా పల్లె రఘునాథ రెడ్డి ముందే పుట్టపర్తి మండలాధ్యక్షుడు భాస్కర్ రెడ్డిపై దాడి చేశారు. వివరాలు.. కల్లు గీత కులాల కోటా మద్యం షాపు టెండర్లలో పుట్టపర్తి మద్యం షాపు శ్యామల అనే మహిళకు దక్కింది. ఆమెకు ఆర్థికంగా సాయం చేసిన వ్యక్తికి వాటా ఇస్తానని ముందుగా హామీ ఇచ్చారు. టెండర్ దక్కిన వెంటనే మరో వ్యక్తికి కూడా వాటా ఇవ్వాలని టీడీపీ నాయకులు కోరారు. నేను ఒకరికి మాత్రమే వాటా ఇస్తానని శ్యామల తెలిపింది. బుధవారం మద్యం తీసుకోవడానికి చివరి గడువు కావడంతో పుట్టపర్తి నుంచి శ్యామలతో పాటు బీజేపీ పుట్టపర్తి మండలాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి బయలు దేరారు. వెల్దుర్తి వద్దకు రాగానే పవన్, రామ్మోహన్ అనే వ్యక్తులు బీజేపీ పుట్టపర్తి మండలాధ్యక్షుడు భాస్కర్ రెడ్డిపై దాడి చేశారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి జోక్యం చేసుకుని గురువారం అనంతపురంలోని తన ఆఫీసుకు రండి.. మాట్లాడదాం. గొడవలు వద్దు అని చెప్పారు. దీంతో మద్యం షాపు టెండర్ దక్కించుకున్న శ్యామల, బీజేపీ పుట్టపర్తి మండలాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి అనంతపురంలోని పల్లె ఇంటికి వచ్చారు. పల్లె రఘునాథ రెడ్డి మరొకరికి మద్యం షాపులో వాటా ఇవ్వాలని కోరారు. గతంలో మాట ఇచ్చిన ప్రకారం ఒకరికి మాత్రమే వాటా ఇస్తానని శ్యామల స్పష్టం చేసింది. ఆగ్రహంతో ఊగిపోయిన పల్లె అనుచరులు బీజేపీ పుట్టపర్తి మండలాధ్యక్షుడు భాస్కర్ రెడ్డిపై చేయి చేసుకున్నారు. భౌతిక దాడి చేయడంతో కర్ణభేరి పగిలిపోయింది. గాయాలు పాలైన భాస్కర్ రెడ్డిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. తమకు పల్లె రఘునాథ రెడ్డి నుంచి ప్రాణహాని ఉన్నట్లు భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు


పీడీ రోజాతో రూప, తనుశ్రీ

అమరాపురం: హలుకూరు సమీపంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు రూప, తనుశ్రీ జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. గత వారం ఒడిశాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడంతో నిర్వాహకులు వారిని జాతీయ పోటీలకు ఎంపిక చేశారన్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో గురువారం నుంచి ప్రారంభమైన జాతీయస్థాయి పోటీలో పాల్గొన్నామని పీడీ రోజా తెలిపారు.

కెంచమాంబదేవికి ప్రత్యేక పూజలు

అమరాపురం: గౌడనకుంట గ్రామంలో వెలసిన కెంచమాంబదేవి అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పెద్ద జాతరలో పని చేసిన వారిని శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఎక్సైజ్ సీఐగా లక్ష్మీ దుర్గయ్య?

హిందూపురం అర్బన్ : హిందూపురం ఎక్సైజ్ సిఐగా మళ్లీ లక్ష్మీ దుర్గయ్యను నియమించినట్లు సమాచారం. గతంలో హిందూపురం స్టేషన్‌లో పని చేస్తూ పలు ఆరోపణలు రావడంతో ఆయన్ను ఉన్నతాధికారులు విజయవాడలోని కమిషనర్ కార్యాలయంలో కలవాలని సూచించారు. తరువాత గురువారం మళ్లీ హిందూపురం సీఐగానే బాధ్యతలు ఇచ్చినట్లు సమాచారం.

దొంగల అరెస్ట్

పావగడ: ఉప్పారహళ్లి తండాలో ఉన్న కాళికాదేవి ఆలయంలోని స్వామివార్ల ఆభరణాలు, హుండీ కానుకలను ఎత్తుకెళ్లిన దొంగలను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. దొంగలు బొమ్మలాట నరసింహ, కనగానపల్లి మండలం బద్దలాపురం గ్రామానికి చెందిన మణికంఠను అరెస్ట్ చేసి రూ.4 లక్షల విలువ చేసే ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.